క్లుప్తంగా

ఘనంగా ఫేర్‌వెల్ డే


వేడుకల్లో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని స్థానిక లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్లో మంచిర్యాల వృత్తి విద్య కళాశాల, శ్రీ సాయి పారామెడికల్ కళాశాలల ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల వొకేషనల్ జూనియర్ కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు ఆటలు, పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీదేవి, మంచిర్యాల వొకేషనల్ జూనియర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.మహాలక్ష్మి, సౌమ్య, ప్రవీణ్, ఖాజా హుస్సేన్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జెండర్ స్పెషలిస్టులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టులు మౌనిక, లిప్సికలు విద్యార్థులకు మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. బేటీబచావో–బేటీ పడావో పథకం, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైం, మహిళా హెల్ప్‌లైన్‌ల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, ఉన్నత హోదాలో ఉండాలని సూచించారు.

మాతృభాష ఎంతో మధురమైంది



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: భాషలన్నింటిలో మాతృభాష ఎంతో మధురమైందని తెలంగాణ ప్రభుత్వ సాంఘికసంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. కళాశాల ఆవరణలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పుట్టుకతో తల్లి నుంచి నేర్చుకునే భాష మాతృభాష అవుతుందన్నారు. మాతృభాషను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. బహుభాష విధానంపై కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమాన్నీ డీఐఓ శైలజ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు తెలుగు, హిందీ, మరాఠీ, గోండు, పర్ధాన్, లంబాడి, ఉర్దూ భాషల్లో కవితలు వినిపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, జేపీపీ శ్రీనివాస్, ప్రేమలత, హారిక, రాజేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా తిరుపతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతిని హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టవేని లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బి.రామచందర్, కార్యవర్గ సభ్యులు బుధవారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు పూదరి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు రవి, సంపత్ రెడ్డి, జి.మల్లేశ్, వి.భిక్షపతి, రాజేందర్, బుచ్చయ్య, తిరుపతి, మల్లేశ్, వినోద్, రమేశ్, వేణుగోపాల్, తిరుపతి, శ్రీనివాస్, ప్రతాప్, పోషం పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



చెన్నూర్‌రూరల్: ఇన్ఫోసెస్ ఫౌండేషన్ సుదామూర్తి ఆధ్వర్యంలో మండలంలోని దుగ్నెపల్లి, సుందరసాల, బావురావుపేట, కోటపల్లి మండలంలోని పారిపెల్లి గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సుమారు 200మంది విద్యార్థులకు బ్యాగులు, డ్రాయింగ్ కిట్లు, ఆట వస్తువులు అందజేశారు.

ఎనిమల్ కేర్ ప్రారంభమెప్పుడో..!

- నిర్మించి ఆరు నెలలు గడిచినా పట్టించుకోని అధికారులు

జిల్లాలో ఆరేళ్లుగా కుక్కకాటుకు గురైన వారు

సంవత్సరం	కుక్కకాటు జరిగినవి
2019	3048
2020	2460
2021	2,168
2022	1,685
2023	2,277
2024	186 (ఫిబ్రవరి 20వరకు)


ఎనిమల్ కేర్ సెంటర్ భవనం

మంచిర్యాలటౌన్: జిల్లాలో రోజురోజుకు కుక్కకాటుకు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఏడు మున్సిపాలిటీల్లో కుక్కల బెడద పెరుగుతున్నా, అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. వీధి కుక్కలను నియంత్రించకపోవడంతో రోడ్లపై గుంపులుగా తిరుగుతూ చిన్నారులతో పాటు, పెద్దవారిపైనా దాడికి దిగుతున్నాయి. దీంతో రోజురోజుకు పెరుగుతున్న శునకాలతో, వీధుల్లో నుంచి నడుస్తూ వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ప్రభుత్వం శునకాల నియంత్రణ కోసం జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లోని శునకాల సంతతిని నియంత్రించేందుకు ప్రత్యేకంగా రూ.35లక్షలతో ఎనిమల్ కేర్ సెంటర్‌ను మంచిర్యాల మున్సిపాలిటీలోని ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డు సమీపంలో ఆరు నెలల క్రితం నిర్మించారు. శునకాల సంతతిని నియంత్రించే ఆపరేషన్లు చేసిన అనంతరం అవి కోలుకునే వరకు వాటిని ఉంచేందుకు ప్రత్యేకంగా కేజెనర్(పంచరం) వంజరం జాలీలతో కూడిన షెడ్‌ను నిర్మించి నెలలు గడుస్తున్నా, వాటిని మాత్రం ప్రారంభించడం లేదు. ఆపరేషన్ అనంతరం ఆరోగ్యంగా అయిన శునకాలను ఎక్కడి నుంచి తీసుకొచ్చారో తిరిగి అక్కడే వదిలేస్తారు. దీనివల్ల కేవలం సంతతిని పెంచకుండా నియంత్రించేందుకు వీలుంటుంది.

చర్యలు తీసుకుంటేనే...

జిల్లా వ్యాప్తంగా ఏటా వీధి కుక్కల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఏటా రెండు వేలకు పైగా ప్రజలు కుక్కకాటుకు గురవుతున్నట్లుగా కేవలం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి లెక్కల్లోకి ఎక్కినవి మాత్రమే. ఇవి కాకుండా, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఇటీవల జిల్లా కేంద్రంలోనే ఓ పిచ్చికుక్క చేసిన దాడిలో దాదాపుగా 30మందికి పైగా ఒకేసారి గాయపడ్డారు. ఒకే కుక్క పదుల సంఖ్యలో ప్రజలను కరవడంతో పాటు, పశువులు, ఇతర వీధి కుక్కలను కరిచింది. స్థానికులు దానిని పట్టుకుని చంపగా, ఇతర వీధి కుక్కలను కరవడంతో, ఆ వీధి కుక్కలతో మరింత ప్రమాదం పొంచి ఉంది. మున్సిపాలిటీల్లో ఎన్ని వీధి కుక్కలు ఉన్నాయన్న సమాచారం కూడా అధికారుల వద్ద లేక పోవడం, వాటి సంఖ్యను లెక్కించి, ఎప్పటికప్పుడు కుక్కలకు రేబీస్ టీకాలను వేయించాల్సి ఉండగా, అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఎనిమల్ కేర్ సెంటర్ నిర్మాణం పూర్తి అయింది. వీధి కుక్కల బెడద ఇటీవల ఎక్కువైంది. వెంటనే ఎనిమల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. వీధి కుక్కలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంతో పాటు, గాయపరిచే కుక్కలను వెంటనే పట్టుకునేలా చూస్తాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని చదవాలి


విద్యార్థికి బహుమతి అందిస్తున్న శైలజ

బెల్లంపల్లి: విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని చదివి ప్రయోజకులు కావాలని డీఐఈఓ శైలజ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్, స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ప్రస్తుతం పరీక్ష సమయం ఆసన్నమైందని, ఈ సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి చదువు మాత్రమే దోహదపడుతుందనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. తదనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో జరిగిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్, సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పేదల భూములు కబ్జా చేసి అమ్ముతున్నారు'

బెల్లంపల్లి: కాంగ్రెస్ నాయకులు పేదల భూములను కబ్జా చేసి అక్రమంగా అమ్మకాలు చేస్తున్నారని బెల్లంపల్లి మండలం సోమగూడెం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకురాలు కోరకొప్పుల ప్రమీల గౌడ్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకెనపల్లి శివారులో పేదలకు చెందిన ప్రభుత్వ భూములను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు కారుకూరి రాంచందర్ అక్రమంగా కబ్జా చేసి ఆ భూముల్లో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో బెల్లంపల్లి మండలంలో భూకబ్జాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కలెక్టర్ తగిన చర్యలు తీసుకుని కాపాడాలని, లేకపోతే బీఆర్ఎస్ తరఫున ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సోమగూడెం ఎంపీటీసీ సభ్యురాలు చుంచు మల్లమ్మ, గ్రామస్తులు లింగయ్య, కర్ణాకర్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికలు రూపొందించండి



జన్నారం: వేసవి సమీపిస్తున్నందునా గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా తగు ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో శశికళ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే గ్రామాలను గుర్తించాలని, నీటి కొరత లేకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. గ్రామాల సమస్యలు ఎప్పటికప్పుడు గుర్తించి తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో రమేష్, ఈజీఎస్ ఏపీవో రవీందర్, ఈసీ విలాస్, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణంపై నమూనా జెడ్పీ సమావేశం


భీమారం జెడ్పీ ఉన్నతపాఠశాలలో...


నస్పూర్: సమావేశంలో విద్యార్థులు


తాండూర్‌లో...

భీమారం: పర్యావరణం అనే అంశంపై బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నమూనా జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా పేరొందిన సమ్మక్క–సారలక్క జాతరలో పర్యావరణం కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సమావేశం నిర్వహించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, సీఈవో జిల్లా పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే, డీఎంహెచ్‌వో, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రలను పోషించారు. విద్యార్థులు పాలకపక్షంగా, ప్రతిపక్షంగా మాక్ జెడ్పీ సమావేశం నిర్వహించారు. జాతరలో జరుగుతున్న పర్యావరణ కాలుష్యంతో తలెత్తే పరిణామాలతో పాటు ప్లాస్టిక్ ఉపయోగంతో జరిగే అనర్థాలను వివరించారు.

నస్పూర్: సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జాతరలో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై నస్పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మాక్ జెడ్పీ సమావేశాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవల్సిన చర్యలను వివరించారు. ప్లాస్టిక్ నిషేధానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం డీ దామోదరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శిరీషదేవి, కమల, శుభాంగి పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని రేచినీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణహిత మేడారం జాతర అనే అంశంపై విద్యార్థులు నమూనా జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులు పర్యావరణానికి విఘాతం కలిగించకుండా వ్యవహరించేలా పాఠశాల విద్యార్థులు ప్రజా ప్రతినిధుల మాదిరి సమావేశం నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్, బయోసైన్స్ టీచర్ ఎం.సరోజ, సీనియర్ ఉపాధ్యాయులు జయశ్రీ, వెంకటేశ్వర్లు, రత్నయ్య, సతీష్, శ్రీనివాస్, రమేష్, సుకుమాంజలి, రవిబాబు, రాజేశం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం


మందులు ఇస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున జరుగుతున్న సమ్మక్క సారక్క జాతర వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చిన 500మందికి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు మల్లేశ్, మేనేజర్ రజిత, కిషోర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, ముక్త రవి, నరెడ్ల శ్రీనివాస్, సుదమల్ల హరికృష్ణ, బదావత్ ప్రకాశ్ నాయక్, కుమార్, పిట్టల రాజు, అబ్దుల్ రహీం, గీట్ల సుమిత్, పాల్గొన్నారు.

అధికారికి సన్మానం



నస్పూర్: సింగరేణిలో జనరల్ మేనేజర్ సర్వేగా విధులు నిర్వర్తించి ఈ నెలలో రిటైర్డ్ అవుతున్న పీఎస్‌కే రవిని ఏరియా జీఎం సంజీవరెడ్డి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

పుస్తె, మట్టెలు అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో పెళ్లి చేసుకున్న నిరుపేద వధువరులకు మంచిర్యాల లయన్స్‌క్లబ్ సఖీ విభాగం అధ్యక్షురాలు బండ శాంకరి పుస్తె, మట్టెలు, బట్టలు అందజేసి ఉదారతను చాటుకున్నారు. స్థానిక శివాలయంలో బుధవారం దహెగాం మండలానికి చెందిన దుర్గం సౌమ్యకు భీమిని మండలం వడాల గ్రామవాసి కామెర విజయ్‌తో పెళ్లి జరిగింది. వధువరులు నిరుపేదలు కావడంతో లయన్స్ క్లబ్ సఖీ విభాగం అధ్యక్షురాలు, సభ్యులు మానవతాదృక్పథంతో పెళ్లి వస్తువులు అందజేసి సంతోషంగా వివాహం చేసుకోవడానికి దోహదపడ్డారు. వీరికి వధువరుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సఖీ బాధ్యులు సుంకరి లక్ష్మి, శివరాణి, ఖాలీషా, లయన్స్‌క్లబ్ సభ్యురాలు సువర్ణ హాజరయ్యారు.

'మమత' నూతన కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మహిళా తరంగిణి (మమత) నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా మంజుల కృష్ణారావు, ఉపాధ్యక్షురాలిగా కె.లీల, కార్యదర్శిగా ఈ.లత, సంయుక్త కార్యదర్శిగా కె.పావని, కోశాధికారిగా నాగమణిలను ఎన్నుకున్నారు. మమత సీనియర్ సభ్యులు భాగ్యలక్ష్మి, సత్యప్రియ, చిదానంద కుమారి, శృతి, సుముఖ, రమాదేవి, మాజీ కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, చంద్రకళ, పద్మ,, జ్యోత్స్న చంద్రదత్‌లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

నెన్నెల: మండలంలోని రైతువేదికలో ఖర్జి జంగాల్‌పేట గ్రామ రైతులకు యాసంగి వరి పంటలో జింకు లోపంతో పాటు కాండం తొలుచు పురుగు అధికంగా ఉందని నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏఈఓ రాంచందర్ బుధవారం అవగాహన కల్పించారు. రైతులు వరి పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ చేసుకోని రైతులకు ఆధార్ డెమోగ్రాఫిక్ పద్ధతిలో ఈకేవైసీ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వన దేవతల జాతర ప్రారంభం

- గద్దెకు చేరిన సారలమ్మ
- నేడు సమ్మక్క రాక

జిల్లా వ్యాప్తంగా సమ్మక్క–సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. బాజాభజంత్రీల మధ్య సారలమ్మను గద్దెలపైకి తీసుకొచ్చారు. నేడు సమ్మక్క ఆగమనం ఉంటుందని పూజారులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు సమర్పించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



కోటపల్లి మండలం మల్లంపేటలో...

కోటపల్లి: మండలంలోని మల్లంపేటలో బుధవారం సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభం అయ్యింది. మొదటగా సారలమ్మను గద్దెపైకి తీసుకొచ్చారు. గురువారం సమ్మక్కను గద్దెపైకి తీసుకురానున్నట్లు నిర్వాహకులు సల్పాల పోచన్న, కాత్రాళ్ల మల్లయ్య, గ్రామ పెద్దలు తెలిపారు.



జిల్లా కేంద్రంలో...



మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని గోదావరి నదితీరంలో జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు సమర్పించుకున్నారు.

కన్నెపల్లి మండలంలో...

భీమిని: కన్నెపెల్లి మండలంలోని ముత్తపూర్, చర్లపల్లి, మెట్‌పల్లి గ్రామాల్లో సమక్క–సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమయింది. సారలమ్మను కంకవనం నుంచి పూజారులు గద్దెలపైకి తీసుకొచ్చారు. పూజారులు, శివసత్తులు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు.



మంగెనపల్లి వద్ద...



వేమనపల్లి: మండల కేంద్రంలోని మంగెనపల్లి ప్రధాన రహదారిపై కొలువై ఉన్న సమ్మక్క–సారక్క గద్దెలపైకి బుధవారం వనదేవతలు ఆగమనం చేశారు. గొర్లపల్లి సమీపంలో ఉన్న కంకవనం నుంచి పూజారి రజిత ఆధ్వర్యంలో భాజభజంత్రీల మధ్య కంకవనం నుంచి తీసుకొచ్చారు.

సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద...

నస్పూర్: కార్మిక క్షేత్రమైన సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభం అయ్యింది. కోయ పూజరులు స్థానిక వనంలో నుంచి డప్పుచప్పుళ్ల మధ్య భక్తుల పూనకాలతో సారలమ్మ ప్రతిమను తీసుకొచ్చి గద్దెల వద్ద ప్రతిష్టించారు. కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి రాదాకుమారి దంపతులు, మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండి పద్మ, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.




సౌకర్యాలు పరిశీలిస్తున్న ఏసీపీ

ఇటిక్యాలలో...

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో నిర్వహిస్తున్న సమ్మక్క– సారలమ్మ జాతర వద్ద బుధవారం సారలమ్మను గద్దె మీదకు తీసుకొచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏసీపీ ప్రకాష్ జాతర ప్రదేశాన్ని పరిశీలించి భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.


జాతర గద్దె వద్దకు చేరిన సారలమ్మ

వెలిశాల మల్లన్న ఆలయ ప్రాంతంలో...



జైపూర్: మండల కేంద్ర సమీపంలోని వెలిశాల మల్లన్న ఆలయ ప్రాంతంలో వెలిసిన సమ్మక్క–సారక్కలకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తొలిరోజున బుధవారం జాతర ప్రారంభమైంది. సమీప ప్రాంతాల భక్తులు కుటుంబసమేతంగా వచ్చి సమ్మక్క–సారక్కల గద్దెల వద్ద పసుపు, కుంకుమలతో ఒడిబియ్యాన్ని సమర్పించి బంగారం(బెల్లం) చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కోళ్లు, మేకలు బలిదానం చేసి అక్కడనే వన భోజనాలు వండుకుని సాయంత్రం వరకు గడిపారు. సమ్మక్క–సారక్క జాతరతో అటవీ ప్రాంతం సందడిగా మారింది.